

# స్నో మచ్ ఫన్..
# సిటీలో వింటర్ థ్రిల్

- కశ్మీర్ మంచు అందాలను మరిపిస్తున్న స్నోథీమ్ ఇండోర్ వినోద కేంద్రం

సిటీబ్యూరో: అలా సరదాగా కశ్మీర్‌కో.. ఊటీకో వెళ్లి కనువిందు చేస్తున్న మంచు పర్చుకున్న అందాలను చూసి ఎంజాయ్ చేయాలనుకుంటారు ఎవరైనా. కానీ ఆయా ప్రాంతాలకు వెళ్లాలంటే..సమయంతోపాటు డబ్బులు ఎక్కువగా ఖర్చు చేయాల్సిందే. ఎందుకులే అంతదూరం వెళ్లడం అని ఆలోచిస్తున్నారా.. అయితే అటువంటి మంచును తలపించే విధంగా మన హైదరాబాద్‌లోనే స్నోవరల్డ్ రారమ్మని పర్యాటకులను పిలుస్తున్నది. అదెక్కడో కాదండి.. కొండాపూర్‌లోని మంచు సోయగంతో అల్లుకున్న 'స్నో కింగ్‌డమ్' అతిశీతలమైన మాయాజాలాన్ని అతి తక్కువ బడ్జెట్‌తోనే ఎంజాయ్ చేయొచ్చు. ఇది దేశంలోనే అతిపెద్ద ఇండోర్ వినోద కేంద్రాలుగా చెన్నై, ముంబై నగరాలతో పాటు కొండాపూర్‌లోని 'శరత్ సిటీ క్యాపిటల్ మాల్' పర్యాటకులను అలరిస్తోంది. వింటర్ థ్రిల్‌గా మన హైదరాబాద్ పర్యాటకులను ఆకర్షిస్తున్నది.

### ఇక్కడి ప్రత్యేకతలివే..

మంచుతో కప్పబడిన పర్వతాలు, ఓక్ చెట్లు, నిలబడి ఉన్న పెంగ్విన్‌లు, ఇగ్లూ ప్రదేశాలు చూపరులను కనువిందు చేస్తున్నాయి. ఆహ్లాదరకమైన వాతావరణంలో అనుభవాన్ని, మంచుపై ఎంజాయ్ చేసేలా.. 'స్నో మచ్ ఫన్' 'ఇది మీ చేతుల్లో ఉంది' అనే పేటెంట్ క్యాచ్ ఫ్రేజ్‌లతో స్నో కింగ్‌డమ్ సందేశాలను పర్యాటకులకు తెలియజేస్తున్నారు.

### రోజుకు 10 సెషన్లు నిర్వహిస్తూ..

పెద్దలకు రూ.650, పిల్లలకు రూ.600 టికెట్ ధర చెల్లించి 45 నిమిషాల పాటు మంచులో ఆడుకోవడం, హిమపాతం అందాలను ఆస్వాదిస్తూ ఆనందంగా ఆడుకోవచ్చు. టోబోగానింగ్, స్నో స్లెడ్డింగ్, స్నో రాక్ క్లైంబింగ్, స్నో డ్యాన్స్, ఫ్లోర్‌లో డ్యాన్స్ వంచి రకరకాల కార్యక్రమాల్లో పాల్గొనవచ్చు. కాగా స్నో కింగ్‌డమ్ రోజుకు 10 సెషన్లను నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు పేర్కొన్నారు.



## జలమండలి ఎండీగా సుదర్శన్‌రెడ్డి బాధ్యతలు స్వీకరణ

సిటీబ్యూరో, డిసెంబర్ 18 (నమస్తే తెలంగాణ ) : జలమండలి మేనేజింగ్ డైరెక్టర్‌గా సుదర్శన్‌రెడ్డి బాధ్యతలు స్వీకరించారు. ఖైరతాబాద్‌లోని ప్రధాన కార్యాలయంలో ఉదయం 10 గంటలకు ఆయన దానకిశోర్ నుంచి బాధ్యతలు తీసుకున్నారు. నూతన ఎండీకి జలమండలి అధికారులు, ఉద్యోగులు ఘన స్వాగతం పలికి శుభాకాంక్షలు తెలిపారు. కాగా, ఇతర రాష్ట్రాల్లో ఎన్నికల విధుల్లో భాగంగా సుదర్శన్‌రెడ్డి రాబోయే 20 రోజుల పాటు సెలవుపై వెళ్లనున్నారు.



అయ్యప్ప దీక్ష చేపట్టిన స్వాములకు అన్నదానం చేసి ఓ ముస్లిం యువకుడు మత సామరస్యాన్ని చాటుకున్నాడు. కొత్తగూడ గ్రామానికి చెందిన ఎండీ బురాన్ దేవాలయంలో స్వాములకు అన్నదానం(బిక్ష) చేశారు. అనంతరం స్వాములు బురాన్‌ను ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో సర్పంచ్ గురుస్వాములు సాద మల్లారెడ్డి, సౌడపు శేఖర్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

– కందుకూరు, డిసెంబర్ 18

# ఉదయం 9 లోపే సిటీ క్లీన్

- చెత్త రహిత నగరంగా తీర్చిదిద్దడమే లక్ష్యం
- వందకు వంద శాతం ఇంటింటి చెత్త సేకరణ
- మెరుగైన పారిశుధ్య నిర్వహణకు వంద రోజుల ప్రణాళిక
- మై జీహెచ్‌ఎంసీ యాప్ ద్వారా నిరంతర పర్యవేక్షణ

**తరచూ చెత్త వేసే 2640 ప్రాంతాలపై నజర్**



సిటీబ్యూరో, డిసెంబర్ 18 (నమస్తే తెలంగాణ ) : వందకు వంద శాతం ఇంటింటికీ చెత్త సేకరణే లక్ష్యంగా జీహెచ్‌ఎంసీ కమిషనర్ రోనాల్డ్‌రాస్ ప్రత్యేక కార్యాచరణ అమలుకు శ్రీకారం చుట్టారు. చెత్త రహిత నగరంగా తీర్చిదిద్దే చర్యల్లో భాగంగా తరచూ చెత్త వేసే ప్రాంతాల (గార్బేజీ వనరేబుల్ పాయింట్లు/జీవీపీ)పై దృష్టి సారించారు. జీహెచ్‌ఎంసీలో డస్ట్‌బిన్‌లు ఎత్తివేసి..స్వచ్ఛ ఆటోల ద్వారా ఇంటింటికీ చెత్త సేకరణ ప్రక్రియ జరుపుతుండగా..అక్కడక్కడా కొందరు బహిరంగంగానే చెత్త వేస్తూ వస్తున్నారు. ఇలా గ్రేటర్ వ్యాప్తంగా 2640 చోట్ల చెత్త కుప్పలున్నట్లు ఆస్కి (అడ్మినిస్ట్రేటివ్ స్టాఫ్ కాలేజ్ ఆఫ్ ఇండియా) నివేదిక ఇచ్చింది. దీంతో కమిషనర్ బహిరంగ ప్రదేశాల్లో చెత్త లేకుండా చేయాలని, తరచూ చెత్త వేసే వారిని గుర్తించాలని నిర్ణయించారు. ఈ మేరకు పారిశుధ్య సూపర్ వైజర్లకు (ఎస్‌ఎఫ్‌ఏ) పర్యవేక్షణ బాధ్యతలు అప్పగించారు. ఒక్కో చోట ఆయా ఎస్‌ఎఫ్ఏను బాధ్యత వహించనున్నారు. తరచూగా చెత్త వేసే వారి పట్ల జీహెచ్‌ఎంసీ జరిమానాలు సైతం విధించనున్నారు. బహిరంగ చెత్త పాయింట్ల తొలగింపు, స్వచ్ఛ ఆటోల పనితీరును మరింత మెరుగు పరుచుకోవడం, ప్రజల్లో స్వచ్ఛ పరిసరాలపై అవగాహన పెంచడం, రాత్రి పూట కొనసాగే హోటళ్లు, ఇతర తిను బండారాల దుకాణదారుల్లో చెత్త నిర్వహణపై విస్తృత ప్రచారం చేపట్టాలని నిర్ణయించారు.

### వంద రోజుల ప్రణాళిక అమలు

గ్రేటర్ పారిశుధ్య నిర్వహణను మరింత మెరుగు పర్చుతూ బల్దియా వంద రోజుల ప్రణాళికను అమలు చేస్తున్నది. ప్రతి రోజూ ఉదయం 9 గంటల లోపే ఇంటింటి చెత్త సేకరణ పూర్తవ్వడంతో పాటు రోడ్లపై వేసిన చెత్త కుప్పలను తొలగిస్తున్నారు. ప్రధానంగా పారిశుధ్య నిర్వహణలో ' మై జీహెచ్‌ఎంసీ' యాప్ ద్వారా కమిషనర్ , జోనల్ కమిషనర్లు, డిప్యూటీ జోనల్ కమిషనర్లు, సహాయ వైద్యాధికారులు, శానిటరీ ఇంజినీర్లు పారిశుధ్యాన్ని పర్యవేక్షిస్తున్నారు. యాప్ విధానం అమలులో భాగంగా చెత్తకుప్పల తొలగింపు పూర్తయిందా? లేదా అనే ' క్లీనింగ్ స్టేటస్' వివరాలను సంబంధిత ఎస్‌ఎఫ్ఏ, స్వచ్ఛ సాతీలు ఉదయం 8–30 గంటల నుంచి 9 గంటల సమయంలో సంబంధిత మొబైల్ యాప్‌లో పొందుపర్చుతున్నారు. ఈ సమయంలో ఆయా ప్రాంతాల్లో చెత్త కుప్పలు కనిపించినట్లైయితే ఆయా అధికారులను బాధ్యులను చేస్తూ చర్యలు ఉంటాయన్న కమిషనర్ ఆదేశాల మేరకు పారిశుధ్య నిర్వహణలో గడిచిన నెల రోజులుగా ఫిర్యాదుల సంఖ్య గణనీయంగా తగ్గిందని చెబుతున్నారు.

## ప్రజావాణికి విశేష స్పందన



సిటీబ్యూరో, డిసెంబర్ 18 (నమస్తే తెలంగాణ) : జిల్లాలో సమస్యల పరిష్కారం కోసం కలెక్టరేట్‌లో నిర్వహిస్తున్న ప్రజావాణి కార్యక్రమానికి విశేష స్పందన వస్తున్నది. పింఛన్లు, రెవెన్యూ సమస్యలు, దివ్యాంగులు, వితంతువులు, పలు రకాల ఆరోగ్య సమస్యలతో కలెక్టర్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ప్రజావాణికి అధిక సంఖ్యలో దరఖాస్తులు వస్తూనే ఉన్నాయి. అందులో భాగంగా ఈ నెల 18న జిల్లా కలెక్టరేట్‌లో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమానికి సమస్యల పరిష్కారం కోసం కలెక్టర్‌కు దరఖాస్తులు ఇచ్చేందుకు ముందుకొచ్చారు. కార్యక్రమంలో డీఆర్‌వో వెంకటాచారి, ఆర్డీవో సూర్యప్రకాశ్, ఇతర జిల్లా అధికారులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.



## కూచిపూడి నృత్య కళానికేతన్ వార్షికోత్సవాలు

సికింద్రాబాద్, డిసెంబర్ 18: పిల్లలు సంస్కారవంతంగా ఎదగడంలో తల్లి పాత్రే చాలా గొప్పదని ప్రముఖ వ్యక్తిత్వ వికాస నిపుణులు డాక్టర్ రవికుమార్ అన్నారు. నృత్య గురువు స్వరాజ్యలక్ష్మి ఆధ్వర్యంలో హరిహర కళాభవన్‌లో నిర్వహించిన కూచిపూడి నృత్య కళానికేతన్ వార్షికోత్సవాలకు ఆయన ముఖ్య అతిథిగా హాజరై చిన్నారి కళాకారులను ఆశీర్వదించి అభినందించారు. సీనియర్ పాత్రికేయులు రత్నాకర శర్మ అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో సరస్వతి ఉపాసకులు దైవజ్ఞ శర్మ, సంగీత గురువు శంభుని మయూరి, నృత్య గురువులు కందాళ హరిణి తదితరులు పాల్గొన్నారు.

# డ్రగ్స్ ముఠా గుట్టు రట్టు

- తీగ లాగితే గోవాలో కదిలిన డొంక
- నెల్లూరుకు చెందిన 33 మంది యువకులతో గ్యాంగ్
- ఇద్దరు డ్రగ్స్ స్మగ్లర్స్..12 మంది వినియోగదారుల అరెస్ట్



నిందితుడు రాజేశ్

సిటీబ్యూరో/వెంగళరావునగర్, డిసెంబర్ 18 (నమస్తే తెలంగాణ): డ్రగ్స్ పార్టీపై టీనాబ్ అధికారులు దాడి చేసి.. ఇద్దరు మాదకద్రవ్యాల విక్రేతలతో పాటు 12 మంది వినియోగదారులను పట్టుకున్నారు. వీరికి పరీక్షలు నిర్వహించగా ముగ్గురికి పాజిటివ్ వచ్చినట్లు టీనాబ్ ఎస్పీ సునీతారెడ్డి తెలిపారు. తెలంగాణ స్టేట్ యాంటీ నార్కోటిక్ బ్యూరో(టీనాబ్) ఎస్పీ సునీతారెడ్డి కథనం ప్రకారం.. నెల్లూరుకు చెందిన జల్లి అశిక్ యాదవ్(28), స్నేహితుడైన రాజేశ్ ఫైనాన్సియల్ డిస్ట్రిక్ట్‌లో ఫ్లాట్‌ను అద్దెకు తీసుకొని ఉంటున్నారు. ఈ ఇద్దరు స్నేహితులు బెంగళూర్, గోవా నుంచి తరచూ మత్తు పదార్థాలు తెచ్చి తాము వాడడంతో పాటు తమ సర్కిల్‌లో ఉన్న వారికి అందజేస్తుంటారు. ఇలా వీళ్లకు తెలిసిన స్నేహితులు, వారి సర్కిళ్లలో ఫామ్ హౌస్‌లు, పబ్‌లు, కిట్టీ పార్టీలు, సర్వీస్ అపార్టుమెంట్లలో డ్రగ్స్ పార్టీలు నిర్వహిస్తున్నారు. ఇందులో భాగంగా ఇటీవల గోవాకు వెళ్లి 60 ఎక్స్‌టాసీ పిల్స్ కొనుగోలు చేసి మొదట నెల్లూరుకు వెళ్లారు. అక్కడ తమ స్నేహితులతో కలిసి పార్టీలు చేశారు. ఆ తరువాత తమ టీమ్‌తో కలిసి హైదరాబాద్‌కు వచ్చి తిరిగి పార్టీలు చేసుకుంటున్నారు. ఒక్కో పిల్‌ను గోవాలో వెయ్యి రూపాయలకు కొని, దానిని ఇక్కడ రూ. 2500 విక్రయిస్తున్నారు. స్నేహితుల సర్కిల్ నుంచి మంచి డిమాండ్ ఉండడంతో అప్పుడప్పుడు గోవా, బెంగళూర్‌కు వెళ్లి డ్రగ్స్ కొని తెస్తున్నారు. ఇటీవల గోవాకు వెళ్లి బాబా అనే వ్యక్తి వద్ద నుంచి డ్రగ్స్‌ను కొనుగోలు చేశారు. ఈ క్రమంలోనే టీ నాబ్‌కు విశ్వసనీయ సమాచారంతో అశిక్ యాదవ్‌ను ఈ నెల 16న అదుపులోకి తీసుకొని విచారించడంతో అతడి వద్ద రెండు పిల్స్ లభించాయి. అతడికి ఇచ్చిన సమాచారం మేరకు మిగతా వారి కోసం గాలిస్తున్నారు. ఈ క్రమంలోనే తాజాగా దుడ్డు రాజేశ్ ఆధ్వర్యంలో ఎస్ఆర్‌నగర్‌లో పార్టీ నిర్వహిస్తున్నాడనే సమాచారంతో టీ నాబ్ ఇన్‌స్పెక్టర్ రాజేశ్ బృందం, ఎస్ఆర్‌నగర్ పోలీసులతో కలిసి పార్టీపై దాడి చేశారు. ఇందులో రాజేశ్‌తో పాటు 12 మందిని పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. ఈ గ్యాంగ్‌లో 33 మంది ఉన్నట్లు పోలీసులు గుర్తించారు. పట్టుబడ్డ వినియోగదారులకు డ్రగ్స్ టెస్టింగ్ నిర్వహించడంతో ముగ్గురికి పాజిటివ్ వచ్చినట్లు తేలింది. మిగతా వారి వద్ద కూడా డ్రగ్స్ పిల్స్‌ను పోలీసులు గుర్తించారు. ఈ మేరకు నిందితులను అరెస్ట్ చేసి 40 డ్రగ్స్ పిల్స్‌ను స్వాధీనం చేసుకున్నారు. ఈ కేసు విచారణను ఎస్ఆర్ నగర్ పోలీసులకు అప్పగించారు. నిందితుల వద్ద నుంచి డ్రగ్స్, ఒక కారు, నాలుగు సెల్‌ఫోన్లు స్వాధీనం చేసుకున్నారు. ఇదిలాఉండగా రాచకొండ రూ. 56 లక్షల విలువైన ఓపీఎంను మల్కాజిగిరి ఎస్‌వోటీ పోలీసులు పట్టుకున్నారని సీపీ సుధీర్‌బాబు వెల్లడించారు.